

ఆస్పత్రిలో ఉంచితే బతికేవారే..

కలుషిత ఆహారం తిని మొదట అస్వస్థతకు గురైన ముగ్గురిని తొలుత కోటవురట్ల సీహెచ్‌సీకి తీసుకువెళ్లిన ఆశ్రమ నిర్వాహకుడు

- ఆదివారం ఉదయానికి బాధితుల సంఖ్య పెరగడంతో ఇళ్లకు పంపి చేతులు దులుపుకున్న కిరణ్‌కుమార్
- మృతి చెందిన ముగ్గురిలో ఒకరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లిన విద్యార్థే



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలలు

నర్సీపట్నం, ఆగస్టు 20: కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ (పాసా) అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులను నిర్వాహకుడు ఆస్పత్రిలోనే ఉంచితే బతికేవారని వైద్యులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి కొర్రా సుశాంత్ అనే విద్యార్థి వాంతులు చేసుకోవడంతో నిర్వాహకుడు కిరణ్‌కుమార్ కోటవురట్ల సీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. ఆస్పత్రిలో వైద్యం చేసిన తర్వాత విద్యార్థిని తీసుకువెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం కొర్రా సుశాంత్‌తో పాటు పి.మౌనిక, జె.జాషువా కూడా వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతో సీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. సీహెచ్‌సీ వైద్యుడు ప్రసాద్‌కు అనుమానం వచ్చి పిల్లలు ఏం తిన్నారని నిర్వాహకుడు కిరణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. సమోసాలు తిన్నారని అతను సమాధానం చెప్పాడు. ఆదివారం ఉదయానికి అనాథాశ్రమంలోని పిల్లలందరికీ వాంతులు, విరేచనాలు అవుతుండడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఇంటికి పంపించేసి కిరణ్‌కుమార్ చేతులు దులిపేసుకున్నాడు. కలుషిత ఆహారం తిని మరణించిన ముగ్గురు పిల్లల్లో కోటవురట్ల సీహెచ్‌సీలో ఆదివారం వైద్యం చేయించుకున్న జాషువా కూడా ఉన్నాడు. పిల్లలను ఇంటికి పంపించకుండా సీహెచ్‌సీలో చేర్పినట్టయితే చనిపోయే పరిస్థితి వచ్చేది కాదని డాక్టర్ ప్రసాద్ తెలిపారు.



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి

ఇంకా 21 మంది ఏరియా ఆస్పత్రిలోనే..

అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ఇంకా 21 మంది గిరిజన విద్యార్థులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మంగళవారం చికిత్స పొందుతున్నారు. అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు గిరిజన విద్యార్థులు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఏరియా ఆస్పత్రికి 60 మంది విద్యార్థులను తరలించగా, సత్వర వైద్య సేవలు అందించి 38 మందిని విశాఖపట్నం తరలించారు. మిగిలిన 22 మందిలో మంగళవారం ఉదయం ఒక చిన్నారి పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖపట్నం తరలించారు. ఇంకా 21 మంది గిరిజన విద్యార్థులు పిల్లల వార్డులో చికిత్స పొందుతున్నారు. వీరిలో మర్రి అలేఖ్య పాంగి అనురాధ, వంతల శైలు, తబిటి రాము, పాంగి సంతోశ్, సిందిరి లక్ష్మి, బూరాడ నూకాల జ్యోతి, తంబెల్లి శ్రీను, సెందిరి డానియల్, సిందిరి కుమారి, తంబెల్లి నందిని, పాంగి లలిత, పాంగి మోసై, వంతల సత్యం, పాంగి అరవింద్, సందిరి ఆనంద్, సందిరి రవి, వంతల సంధ్య, పాంగి అంజలి, పాంగి శివాజి, పాంగి జగన్, వంతల గౌతమ్ చికిత్స పొందుతున్నారని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవి వార్డును సందర్శించి చిన్నారులను పరీక్షించారు. వారి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉందని ఆమె తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల వాంతులు, విరేచనాలకు సంబంధించి శాంపిల్స్ పరీక్షకు పంపినట్టు అధికారులు తెలిపారు. కాగా అనాథాశ్రమ నిర్వాహకుడు, పాస్టర్ కిరణ్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరిచి నర్సీపట్నం సబ్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించినట్టు డీఎస్పీ మోహన్ తెలిపారు.

కేజీహెచ్‌కు మరో 28 మంది చిన్నారులు - 7లో

విచారణ కమిటీ ఏర్పాటు

పది రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం, 42 మంది అస్వస్థతకు గురికావడంతో దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కలెక్టర్ విజయకృష్ణన్.. జేసీ జాహ్నవి అధ్యక్షతన విచారణ కమిటీని నియమించారు. విచారణ కమిటీలో జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ లక్ష్మమ్మ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి శిరీషా, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి, డీసీహెచ్ శ్రీనివాసరావు, నర్సీపట్నం ఆర్డీవో జయరామ్, డీఎస్పీ మోహన్ ఉన్నారు. కమిటీ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పది రోజుల్లో నివేదిక అందజేయనుంది. కమిటీలో అధికారులు ముఖ్యంగా సంఘటన చోటుచేసుకున్న కోటవురట్ల మండలం కైలాసపట్నంలో అనాథాశ్రమాన్ని సందర్శించి వివరాలు సేకరించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులతో కమిటీ సభ్యులు మాట్లాడి సమగ్ర నివేదికను పది రోజుల్లో కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఒక్క కోటవురట్ల మండలంలో సంఘటనపైనే కాకుండా విచారణ కమిటీ జిల్లాలో అనుమతి లేకుండా నడుస్తున్న అనాథాశ్రమాలు ఎన్ని ఉన్నాయి?, ఆయా ఆశ్ర మాల నిర్వాహకులు ఎవరు?, నిధులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే వివ రాలు సేకరించనుంది. అంతే కాకుండా జిల్లాలో అనుమతితో నడుపుతున్న మాకవరపాలెం ఇమ్మానుయేలు అనాథాశ్రమం, కోటవురట్ల, మునగపాక మండలం కొండకర్ల ఆవలో వున్న మరో నాలుగు అనాథాశ్రమాల్లో మౌలిక వసతులు, విద్యార్థుల వివరాలను సేకరించనున్నారు.



ముద్దగా ఉన్న అన్నం

ముద్దగా అన్నం, నీళ్ల సాంబారు

ఇమ్మానుయేలు అనాథాశ్రమంలో విద్యార్థులకు పెట్టే భోజనం ఇది

- అది కూడా అరకొరగానే..
- రెండు ఆశ్రమాలను తనిఖీ చేసిన తహసీల్దార్
- అక్కడి పరిస్థితులపై అసహనం
- ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వెల్లడి



తామరం ఇమ్మానుయేలు అనాథాశ్రమంలో విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్

మాకవరపాలెం, ఆగస్టు 20: ముద్దగా ఉన్న అన్నం, నీళ్ల సాంబారు.. అది కూడా అరకొరగా తయారీ.. ఇదీ ఇమ్మానుయేలు సంస్థ యాజమాన్యం విద్యార్థులకు పెట్టే భోజనం. మాకవరపాలెం తహసీల్దార్ ప్రసాద్ మంగళవారం తామరం, కొండలఅగ్రహారంలో ఉన్న ఈ సంస్థకు చెందిన రెండు అనాథాశ్రమాలను తనిఖీ చేసినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కోటవురట్లలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా, 42 మంది అస్వస్థతకు గురైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు తహసీల్దార్.. ఇమ్మానుయేలు సంస్థకు చెందిన రెండు అనాథాశ్రమాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కొండలఅగ్రహారంలోని అనాథాశ్రమాన్ని ఆయన సందర్శించారు. అక్కడ 40 మంది విద్యార్థులు ఉండగా, చాలీచాలని భోజనం తయారు చేసినట్టు గుర్తించారు. పిల్లలకు ఈ భోజనాలు ఏం సరిపోతాయని తహసీల్దార్ ప్రశ్నించగా, ప్రిన్సిపాల్ పొంతన లేని సమాధానం చెప్పారు. విద్యార్థులకు భోజనాలు ఇక్కడ పెట్టడం లేదని, వేరే చోట పెడుతున్నామన్నారు. సిబ్బంది అయితే విద్యార్థుల కోసమని ఒకసారి, కాదు ఆస్పత్రిలోని రోగులకు అని మరోసారి చెప్పారు.

విద్యార్థులకు అరకొర భోజనం

అనంతరం తామరంలోని అనాథాశ్రమానికి తహసీల్దార్ వెళ్లి అక్కడి వంటశాలను పరిశీలించారు. అక్కడ ముద్దగా ఉన్న అన్నంతో పాటు నీళ్ల సాంబారు, పప్పు ఉన్నాయి. అన్నం ఇంత దారుణంగా ఉందేమిటని ఆయన ప్రశ్నిస్తే నాణ్యత గల బియ్యమే వాడుతున్నామని సిబ్బంది చెప్పారు. అయితే అక్కడ నాసిరకం బియ్యం బస్తాలు ఉండడాన్ని తహసీల్దార్ గుర్తించారు. ఇక్కడ 180 మంది విద్యార్థులకు అరకొరగా వంటలు వండడం, విద్యార్థులకు కనీసం మజ్జిగ కూడా ఇవ్వకపోవడంపై సంస్థ నిర్వాహకులపై తహసీల్దార్ అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని తహసీల్దార్ ... మిగతా 8వ పేజీలో

ప్రభుత్వ శాఖల్లో బదిలీలకు కసరత్తు

- శాఖల వారీగా ఉద్యోగుల వివరాల సేకరణ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)



ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సందడి నెలకొంది. ఈ నెల 30వ తేదీతో బదిలీల ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉండడంతో బదిలీల పరిధిలోకి వచ్చే శాఖల ముఖ్య అధికారులు, ఉద్యోగుల వివరాల సేకరిస్తున్నారు. ఉద్యోగులు ప్రస్తుతం ఎక్కడ పనిచేస్తున్నారు?, ఎంతకాలంగా పనిచేస్తున్నారు?, హోదా, తదితర వివరాలతో పాటు వ్యక్తిగత వివరాలను అధికారులు సేకరించి బదిలీలకు సంబంధించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రాతిపదికన బదిలీలు జరగనున్నాయి. జిల్లా పరిధిలో 24 మండలాలు ఉండగా, సుమారు 15 వేల పైచిలుకు ఉద్యోగులున్నారు. విద్య, వైద్య వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, పశు సంవర్థక, మత్స్యశాఖలతో పాటు మరికొన్ని శాఖల ఉద్యోగుల బదిలీలు ఇప్పట్లో లేనట్టేనని ప్రభుత్వం తేల్చి చెప్పడంతో మిగిలిన శాఖల్లో ఐదేళ్ల ఒకేచోట సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగుల వివరాలను ఆయా శాఖల ఉన్నతాధికారులు సేకరించే పనిలో ఉన్నారు. బుధవారం నాటికి ఇది ఓ కొలిక్కి రానుంది.

సచివాలయ సిబ్బందికి కొత్త సమస్య

జిల్లాలో 522 వార్డు, గ్రామ సచివాలయాలు ఉన్నాయి. సుమారు 4,350 మంది వివిధ కేడర్ల ఉద్యోగులు పనిచేస్తున్నారు. సుమారు 13 వందల పోస్టులు సచివాలయాల్లో ఖాళీగానే ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీలు సచివాలయాల్లో సిబ్బందికి వర్తిస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసి 2020 నుంచి దశలవారీగా ఉద్యోగుల నియామకాలు చేపట్టింది. మూడు, నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగులే ఎక్కువమంది ఉన్నారు. వీరి బదిలీల విషయంలో ఇంకా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదల కాలేదు. దీంతో సచివాలయాల సిబ్బందికి బదిలీలు ఉంటాయా?, లేక ఆయా ఉద్యోగులను సర్దుబాటు చేస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది.

పడకేసిన పర్యాటకం

గత ఐదేళ్లుగా గాలికి వదిలేసిన వైసీపీ సర్కారు

- టీడీపీ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులపై నిర్లక్ష్యం
- పెట్టుబడిదారుల సదస్సులో పదికిపైగా ఒప్పందాలు
- ఒక్కటి కూడా కార్యరూపం దాల్చని వైనం
- అరకులో నిరుపయోగంగా డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, కళావేదిక
- అసంపూర్తిగా ఈట్ స్ట్రీట్, ట్రైబల్ హట్స్ ప్రాజెక్టులు
- విశాఖ, అరకు, భీమిలి ఉత్సవ్‌లకు కూడా చెల్లు చీటీ
- నేడు పర్యాటక శాఖా మంత్రి సమీక్ష



కొండకర్ల ఆవ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పర్యాటకం వెలవెలబోతోంది. వైసీపీ ప్రభుత్వం ఒక్క రుషికొండ భవనంపైనే దృష్టి పెట్టి మిగిలిన వాటిని గాలికి వదిలేసింది. టీడీపీ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కూడా ఆసక్తి చూపలేదు. కొన్నింటికి ప్రారంభోత్సవాలు చేసి వదిలేసింది.

రాష్ట్రంలో టెంపుల్ టూరిజం కేంద్రమైన తిరుపతి తరువాత పర్యాటకులు అత్యధికంగా వచ్చేది విశాఖపట్నం జిల్లాకే. ఇక్కడ అరకులోయ అందాలు, విశాఖ, భీమిలి బీచ్ సోయగాలు, బొర్రాగుహలు, లంబసింగి ఆకట్టుకుంటాయి. వైసీపీ హయాంలో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో విశాఖ కేంద్రంగా పర్యాటక ఒప్పందాలు పదికి పైగా చేసుకున్నారు. అందులో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. రూ.200 కోట్లతో దేవ్ భూమి సంస్థ రోప్‌వే ప్రాజెక్టు చేపడతామని ఎంఓయూ చేసుకుంది. ఒక్కచోట కూడా రాలేదు. డ్రీమ్ వ్యాలీ సంస్థ వేయి కోట్ల రూపాయలతో గోల్ఫ్ గేటెడ్ కమ్యూనిటీ, 5 స్టార్ రిసార్ట్ కడతామని ఒప్పందం చేసింది. కనీసం డీపీఆర్ కూడా కాలేదు. మరో సంస్థ రూ.150 కోట్లతో ఎకో టూరిజం ప్రాజెక్టులు చేపడతామని సంతకాలు చేసింది. అడుగు ముందుకు పడలేదు. ఇంకా రూ.250 కోట్లతో జల విహారాలు, రూ.120 కోట్లతో స్కై టవర్, రూ.100 కోట్లతో టన్నెల్ అక్వేరియం నిర్మాణానికి ఒప్పందాలు జరిగాయి. వీటిలో ఒక్కటి కూడా కార్యరూపం దాల్చలేదు. పర్యాటక శాఖ ఒప్పందాలు చేసుకోవడానికే పరిమితమై వాటిని పట్టించుకోకుండా వదిలేసింది.

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వైసీపీ ప్రభుత్వం వాటికి నిధులు మంజూరు చేయకపోవడంతో మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అరకులోయలోని హరితావేలి రిసార్టులో తెలుగుదేశం ప్రభుత్వం సుమారు రూ.రెండున్నర కోట్లతో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్, థింసా కళావేదికలను నిర్మించింది. వీటిని అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. కానీ నేటికీ డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ మూతబడే ఉంది. అలాగే కళావేదిక కూడా నిర్వహణ లేక తుప్పలతో నిండిపోయి ఉంది. ఇదిలావుండగా అరకులోయ పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొత్తవలస హెచ్ఎన్‌టీసీ ఫామ్‌కు చెందిన 18 ఎకరాల్లో రూ.7 కోట్లతో ఈట్‌స్ట్రీట్, ట్రైబల్‌హట్ ప్రాజెక్టులను గత తెలుగుదేశం ప్రభుత్వం మంజూరు చేసింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమయ్యాయి. పనులు జోరుగా జరుగుతున్న తరుణంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైసీపీ ప్రభుత్వం కొలువు దీరడంతో ఈ ప్రాజెక్టు మూలకు చేరింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 20 శాతంలోపు జరిగిన పనులను నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో పనులు నిలిచిపోయాయి. దీంతో ఈట్ స్ట్రీట్, ట్రైబల్ హట్‌లు తుప్పలు, మొండిగోడలతో దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా చింతపల్లి మండలం లంబసింగిలో 12 రిసార్ట్స్ నిర్మాణానికి టీడీపీ హయాంలో పనులు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వంలో ముక్కుతూ మూలుగుతూ అందులో ఆరు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన ఆరింటికి కనీసం పునాదులు కూడా వేయలేదు. మేఘాలతో అలరించే చెరువులవేనం గ్రామానికి రహదారిని ప్రతిపాదించారు. మట్టి రోడ్డుతో సరిపెట్టేశారు. ఇక అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలంలో గల కొండకర్ల ఆవకు సందర్శకుల సంఖ్య పెరుగుతున్నా మౌలిక వసతులు లేవు.

ఉత్సవ్‌లకు తిలోదకాలు

పర్యాటకులను ఆకర్షించేందుకు అడపాదడపా ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ ఉండాలి. తెలుగుదేశం హయాంలో ప్రతి ఏటా డిసెంబరులో విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్, అరకు ఉత్సవ్‌లు నిర్వహించేవారు. వైసీపీ హయాంలో ఒకే ఒక ఏడాది నిర్వహించారు. ఆ తరువాత పూర్తిగా ఆపేశారు. వాస్తవానికి ఈ ఉత్సవాలకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు పెద్దఎత్తున తరలివస్తారు. వీటిని పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది.

నేడు పర్యాటక మంత్రి రాక

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ బుధవారం విశాఖపట్నం వస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధికారులతో సాయంత్రం ఐదు ... మిగతా 8వ పేజీలో

యథేచ్ఛగా అనధికార లేఅవుట్లు

- నాలా కన్వర్షన్ లేకుండానే ప్లాట్ల విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



మునిసిపాలిటీ పరిధి యర్రవరంలో అనధికార లేఅవుట్

ఎలమంచిలి, ఆగస్టు 20:

మునిసిపాలిటీ పరిధిలో అనధికార లేఅవుట్లు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కొందరు రియల్టర్లు నాలా కన్వర్షన్ లేకుండానే అనధికార లేఅవుట్లు వేసి విక్రయించేస్తున్నారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మునిసిపాలిటీలో ప్రధానంగా పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, యర్రవరం, సోమలింగపాలెం, పెదగొల్లలపాలెం తదితర ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లు దర్శనమిస్తున్నాయి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర స్థలంగా మార్పు చేసేందుకు అవసరమైన నాలా కన్వర్షన్ ఫీజు చెల్లించకుండానే లేఅవుట్లు వెలుస్తున్నాయి. ప్లాట్లను దర్జాగా విక్రయించేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై పట్టణ ప్రణాళికాధికారి శ్రీలక్ష్మిని వివరణ కోరగా ఇప్పటికే మునిసిపాలిటీలో అనధికార లేఅవుట్లను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్టీఆర్ కాలనీ, యర్రవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, పెదగొల్లల పాలెం ప్రాంతాల్లో అనధికార లేఅవుట్లను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్టు తెలిపారు..

ఒలింపియన్ ఎర్రాజీ జ్యోతికి ఘన స్వాగతం



ఎర్రాజీ జ్యోతికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

పారిస్ ఒలింపిక్ గేమ్స్‌లో పాల్గొని ముంబై నుంచి మంగళవారం రాత్రి విశాఖ చేరుకున్న అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. - 7లో

నేటి ఏయూ పరీక్షలు వాయిదా

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం జరగాల్సిన పీజీ, డిగ్రీ పరీక్షలను భారత్ బంద్ కారణంగా వాయిదా వేసినట్టు ఏయూ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయిదా వేసిన పరీక్షను ఎప్పుడు నిర్వహించబోయేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

క్రైం... crime news

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య



అనకాపల్లి టౌన్, ఆగస్టు 20: స్థానిక విజయ రామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్‌పీ దువ్వాడ ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన దొడ్డి వెంకటరమణ(42) తుమ్మపాలలోని శీతలపానీయాల డీలర్‌గా వ్యవహరిస్తున్నాడు. తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో విశాఖ నుంచి విజయవాడ వైపు వెళ్లే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే అతను ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. అనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వేస్టేషన్ నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శాంతారామ్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- భర్తే హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు
- కేసు నమోదు, విచారణ ప్రారంభించిన పోలీసులు



భారతి (ఫైల్)

చింతపల్లి, ఆగస్టు 20: మండల కేంద్రంలో ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందింది. ఆమెది ఆత్మహత్య కాదని, భర్త అత్తమామలు హత్య చేశారని మృతురాలు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన్నట్టు సీఐ కె.రమేశ్ తెలిపారు. మృతురాలు బంధువులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. గొలుగొండ మండలం కొంగసింగికి చెందిన కర్రి భారతి(28)ని ఎనిమిదేళ్ల క్రితం చింతపల్లి నెయ్యలవీధికి చెందిన కర్రి మణికంఠ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. సోమవారం రక్షాబంధన్ పురస్కరించుకుని సోదరుడుకి రాఖీ కట్టేందుకు భారతి స్వగ్రామానికి వెళ్లింది. ఆమె తిరిగి రాత్రి ఏడు గంటలకు చింతపల్లి చేరుకున్నది. భార్య రాఖీ కట్టడానికి స్వగ్రామానికి వెళ్లడం, ఆలస్యంగా ఇంటికి రావడంతో భార్యాభర్తలు రాత్రి గొడవ పడ్డారు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో భారతిని భర్త మణికంఠ కొట్టాడు. దీంతో మంగళవారం ఉదయం భారతి తన తండ్రి రమణ, సోదరుడు రాజుకి ఫోన్ చేసి అత్తవారి ఇంటిలో వేధింపులు తట్టుకోలేకపోతున్నానని, తనను ఇక్కడ చంపేసేలా ఉన్నారని, వెంటనే వచ్చి ఇంటికి తీసుకొని వెళ్లిపోండి అని చెప్పింది. భారతి మాట్లాడుతుండగానే ఫోన్ కట్ అయ్యిందని బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. గంట తరువాత భారతి ఫ్యాన్‌కి ఉరి వేసుకుని చనిపోయిందని భర్త మణికంఠ ఫోన్ చేయడంతో హుటాహుటిన చింతపల్లి వచ్చామని తండ్రి రమణ, సోదరుడు రాజు తెలిపారు. అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి చీర కట్టుకుని ఆత్మహత్య చేసుకున్నదని భర్త మణికంఠ, మామయ్య వెంకన్న చెబుతున్నారు. అయితే భర్త మణికంఠ తల్లిదండ్రులతో కలిసి భారతిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై మృతురాలు తండ్రి రమణ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ రమేశ్, ఎస్‌ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. భారతి మృతిపై లోతుగా విచారణ చేస్తున్నట్టు వారు చెప్పారు.

ఘాట్‌లో ఆటో బోల్తా

- తొమ్మిది మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషయం

జి.మాడుగుల, ఆగస్టు 20: మండలంలోని సొలభం ఘాట్‌లో ఆటో బోల్తా కొట్టడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కుటుంబీకులు, వైద్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం వారపుసంత కావడంతో సొలభం పంచాయతీ ఎస్.కొత్తూరు నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో ఘాట్ దిగుతుండగా అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన కిల్లో చిట్టిబాబు, ఏడాది చిన్నారిలకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే అదే గ్రామానికి చెందిన కె.రాజు, టి.నూకలమ్మ, టి.రూపవతి, పి.పద్మ, ఎస్.కొండబాబు, టి.యశ్వంత్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను జి.మాడుగుల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ హనుమంతరావు క్షతగాత్రులను పరామర్శించారు.

హరియాణా ముఠా పనే...

- ఏటీఎంలలో దోపిడీ కేసు దర్యాప్తులో పురోగతి
- ఐదుగురు పాల్గొన్నట్టు గుర్తింపు
- అందులో ఒకరు పాత నేరస్థుడు
- నిందితుల కోసం వెళ్లిన ప్రత్యేక బృందాలు

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏటీఎం కేంద్రాల్లో చోరీలకు పాల్పడుతున్నది హరియాణాకు చెందిన ముఠాగా పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అనకాపల్లి జిల్లా మునగపాకలోని ఎస్‌బీఐ ఏటీఎంను ఈనెల 16న అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్‌కట్టర్‌తో కట్ చేసి రూ.14.4 లక్షలను ఎత్తుకుపోయారు. ఆ మరుసటిరోజే పెందుర్తి, తగరపువలసలో అదేతరహాలో రూ.33.4 లక్షలు అపహరించుకుపోయిన విషయం తెలిసిందే. చోరీ జరిగిన పెందుర్తి, తగరపువలస ఏటీఎంను సీపీ శంఖబ్రతబాగ్చి స్వయంగా పరిశీలించారు. ఈ తరహా నేరాలు గతంలో జరిగినందున పాత నేరస్థుల వివరాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. మునగపాక, పెందుర్తి, తగరపువలసల్లో ఒకే ముఠా చోరీకి పాల్పడినట్టు అంచనాకు వచ్చారు. ఐదుగురు వ్యక్తులు ఒక కారుతో పాటు బైక్‌పై వచ్చి మూడుచోట్ల చోరీ చేసి వెళ్లిపోయినట్టు పోలీసులు గుర్తించారని తెలిసింది. వీరంతా హరియాణాలోని నుహ్ జిల్లాకు చెందినవారని సమాచారం. వారిలో ఒకరు గతంలో నగరంలో ఇదే తరహా చోరీలు చేసినట్టు పోలీసులు నిర్ధారించినట్టు తెలిసింది. వరుసగా రెండు రోజులు చోరీలు చేయడం, తర్వాత కొంతకాలం ఆగి మళ్లీ ప్రారంభించడం... ఆ ముఠా ప్రత్యేకత అని, విశాఖ నగరంలోనే కాకుండా దేశవ్యాప్తంగా తిరుగుతూ ఈ తరహా దోపిడీలకు పాల్పడుతుంటుందని తెలిసింది. ఇదిలావుండగా చోరీ జరిగిన ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపాల్సిన తేదీ కంటే ఒకరోజు ముందుగానే నింపడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే బాధ్యతను బ్యాంకులు కొన్ని ఏజెన్సీలకు అప్పగిస్తుంటాయి. అలాంటి ఏజెన్సీలో పనిచేసే సిబ్బంది ఎవరైనా దొంగల ముఠాతో సంబంధాలు కలిగివుండడం వల్ల ఒకరోజు ముందుగానే నగదు నింపారేమోనని కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు సమాచారం. చోరీలకు పాల్పడిన ముఠా సభ్యులు ప్రస్తుతం హరియాణాలో ఉండడంతో అక్కడికి ప్రత్యేక బృందాలు వెళ్లినట్టు సమాచారం.

పెదగోగాడ ఆస్పత్రిని తనిఖీ చేసిన కేంద్ర బృందం



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్రబృందం

చీడికాడ, ఆగస్టు 20: మండలంలోని పెదగోగాడ ప్రభుత్వ ఆస్పత్రిని సోమ, మంగళవారాల్లో కేంద్ర బృంద అధికారులు డాక్టర్ మినిమొలాన్, డాక్టర్ ఎలిజిబెత్ మిలీ వర్గీష్ తనిఖీ చేశారు. ఆస్పత్రిలో గ్రామీణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ముఖ్యంగా వైద్యపరంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రి లోపల అన్ని రూమ్‌లను పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో వైద్యాధికారి కిలపర్తి ఉషచైతన్య, సిబ్బంది, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509



విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులు

కేజీహెచ్‌కు మరో 28 మంది చిన్నారులు

- నర్సీపట్నం ఆస్పత్రి నుంచి తరలింపు
- మొత్తం 42 మందిలో ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ఆరుగురు ప్రైవేటు ఆస్పత్రులకు తరలింపు
- మిగిలిన వారికి కేజీహెచ్‌లో కొనసాగుతున్న వైద్య సేవలు



బ్యాటరీ వాహనంపై పిల్లల వార్డుకు తరలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో కలుషిత ఆహారం తినడం వల్ల అస్వస్థతకు గురైన చిన్నారులు మరికొంతమందిని మంగళవారం కేజీహెచ్‌లో తీసుకువచ్చారు. సోమవారం అర్ధరాత్రి వరకూ 14 మంది రాగా పీడియాట్రిక్ వార్డులో చేర్చుకుని సేవలు అందించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, కొయ్యూరు మండలం డౌనూరు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మరో 28 మంది పిల్లలను మంగళవారం తెల్లవారుజాము నుంచి కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. వీరిలో 24 మంది పూర్తిగా కోలుకున్నప్పటికీ ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా చిన్న పిల్లల విభాగంలోని జనరల్ వార్డులో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మరో 12 మంది క్రమంగా కోలుకుంటున్నట్టు వైద్యులు తెలిపారు. ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్న ముగ్గురు చిన్నారులను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్రియాటినైన్ లెవెల్స్ అధికంగా ఉండడంతోపాటు ఇప్పటికీ షాక్‌లోనే ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఎస్.రవి (8) అనే బాలుడిని మంగళవారం తెల్లవారుజామున రెయిన్ బో ఆస్పత్రికి తరలించారు. అలాగే, పి.మౌనిక (10), పి.జస్సిక (9)ల పరిస్థితి ఆందోళనకరంగానే ఉండడంతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. మౌనిక సీరం క్రియాటినైన్, యూరియా లెవెల్స్ అధికంగా ఉన్నట్టు గుర్తించారు. అదేవిధంగా జస్సిక పరిస్థితి కూడా మెరుగుపడకపోవడంతో కిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నయామి, ప్రభాస్, చరణ్‌లను మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.

వీరుకాకుండా కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో కె.సుశాంత్ (8)కు వాంతులు, విరేచనాలు అవుతుండడంతోపాటు కిడ్నీలో సమస్య ఉన్నట్టు గుర్తించి వైద్యం అందిస్తున్నారు. కె.మీరా (10) పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. బీపీ తక్కువగా ఉండడంతోపాటు సీరం క్రియాటినైన్ లెవెల్ 3.6 వరకూ పెరిగింది. ఎం.నవీన్ (10) వాంతులు, విరేచనాలతో బాధపడుతుండడంతోపాటు షాక్‌లో ఉన్నాడు. పి.మౌనిక (3), కిల్లో జ్యోతి (11), ఎం.రంజిత్ (12), ఎం.ప్రశాంత్ (8), ఎస్.నాని (7), జి.వంశీ (6), జి.ధన్యతా (9), ఎం.కుమార్ (8), పి.నందిని (7), కె.సురేష్ (8), కె.గణేష్ (9), టి.రాహుల్ (10), టి.ఇజ్రాయిల్ (10), టి.దివ్య (13) లు కొద్దిగా డీ హైడ్రేషన్‌తో బాధపడుతున్నట్టు గుర్తించి సేవలు అందిస్తున్నారు. వీరంతా ఇప్పటికీ షాక్‌లోనే ఉన్నట్టు చెబుతున్నారు. మిగిలిన చిన్నారుల ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు.

విద్యార్థుల మృతికి కారణమేమిటో?

- బిర్యానీ, సమోసాల్లో ఏది కలుషితమైందో..
- పోస్టుమార్టం నివేదిక వస్తే గానీ తెలియదంటున్న వైద్య ఆరోగ్యశాఖాధికారులు

కోటవురట్ల, ఆగస్టు 20: మండలంలోని కైలాసపట్నం పరిశుద్ధాత్మ అగ్నిస్తుతి ఆరాధన ట్రస్ట్ (పాసా) అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందగా, 42 మంది అస్వస్థతకు గురికావడానికి ప్రధాన కారణం ఏమిటో అధికారులకు అంతు చిక్కడం లేదు. శనివారం రాత్రి దాతలు ఇచ్చిన బిర్యానీ, సమోసాలను విద్యార్థులు తిన్నారు. అయితే ఇందులో దేని వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారో అర్థం కావడం లేదు. మృతి చెందిన ముగ్గురు విద్యార్థుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఆ రిపోర్టు వస్తే గానీ దీనిపై స్పష్టత రాదని వైద్యఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు. అనాథాశ్రమ నిర్వాహకుడు కిరణ్‌కుమార్ నిర్లక్ష్యం వల్లే ఇదంతా జరిగిందని, ఆ విద్యార్థులకు సకాలంలో వైద్యం అందించి ఉంటే ప్రాణ నష్టం జరిగేది కాదని పలువురు అంటున్నారు.

2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యం

- అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి
- విశాఖలో ఘనస్వాగతం



విశాఖ చేరుకున్న జ్యోతికి విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 20: 'పారిస్ ఒలింపిక్స్ మంచి అనుభవం ఇచ్చింది. 2028లో లాస్ ఏంజెల్స్‌లో జరిగే సమ్మర్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించే దిశగా సాధన చేయడమే నా ముందున్న లక్ష్యం'..అని నగరానికి చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతి ప్రకటించింది. పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొని మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న ఆమెకు విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ద ఒలింపిక్ అసోసియేషన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రతినిధులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విమానాశ్రయం వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో జ్యోతి మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పాల్గొంటున్న తొలి అథ్లెట్‌గా గుర్తింపు రావడంతో కొంత ఒత్తిడికి గురైనట్టు తెలిపింది. దీనికితోడు హీట్స్ ముందు రోజు వరకు గాయం కొంత ఇబ్బంది పెట్టిందని, అయినప్పటికీ క్వాలిఫై కావాలని రౌండ్-1లో పట్టుదలతో పరుగు తీసినా ఆశించిన ఫలితం సాధించలేకపోయానన్నది. అయితే ఉద్దండులైన అథ్లెట్లతో పోటీపడడంతోపాటు ఒలింపిక్స్ వంటి అతి పెద్ద ట్రాక్ అండ్ ఫీల్డ్‌పై రేస్‌లో పాల్గొనడం మంచి అనుభవాన్నిచ్చినట్టు చెప్పింది. ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో అకాడమీలు ఏర్పాటుచేసి మంచి శిక్షణ అందిస్తే ఉన్నత స్థాయి అథ్లెట్లు రూపొందుతారన్నది. ఔత్సాహికులకు ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం అందితే ఆసియా గేమ్స్, కామన్‌వెల్త్, ఒలింపిక్స్ వంటి అత్యున్నత స్థాయి ట్రాక్ అండ్ ఫీల్డ్ మీట్స్‌లో దేశానికి పతకాలు అందించే అథ్లెట్లు తయారవుతారని పేర్కొంది. జ్యోతికి స్వాగతం పలికిన వారిలో ఒలింపిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, కోశాధికారి మోహన్ వెంకటరామ్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడాధికారి జూన్ గ్యాలియట్, కోచ్‌లు, మాజీ ఒలింపియన్ ఎంవీ మాణిక్యాలు, పలు క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

- కలెక్టర్ విజయకృష్ణన్





హాజరైన అధికారులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తుందని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిలాలోని పలువురు పారిశ్రామికవేత్తలు, అసోసియేషన్ ప్రతినిధులతో ప్రత్యేక జిల్లా ఇండస్ట్రీయల్ ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశ్రామికంగా జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నూతన పరిశ్రమల స్థాపనకు మౌలిక సదుపాయాల కల్పన, నిబంధనల క్రమబద్ధీకరణలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం పారిశ్రామిక విధానం 2024-29, ఎంఎస్ఈఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ పాలసీ-2024-29 రూపకల్పన ప్రక్రియ చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని చెప్పారు. జిల్లాలో అందుబాటులో వున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఉపయోగకరంగా ఉంటుందో జిల్లాలో పారిశ్రామిక వేత్తలు, ఇండస్ట్రీయల్ యూనియన్లు, అసోసియేషన్ ప్రతినిధులు తమ సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో డీఆర్‌వో బి.దయా నిధి, జిల్లా పరిశ్రమల శాఖాధికారి జీఎం శ్రీధర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్ వివిధ శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



పట్టణంలోని మెయిన్‌రోడ్డు పై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తుమ్మపాల, ఆగస్టు 20: ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, వసతిగృహాల్లో మహిళా వైద్యులు, నర్సులు, ఉద్యోగుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపించాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ డిమాండ్ చేశారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా పీడీఎస్‌వో ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో కలిసి అనకాపల్లి మెయిన్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకులు జి.ఉషా, లక్ష్మీకుమారి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై ఆందోళన



న్యాయస్థానం ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై మంగళవారం కోర్టు సముదాయం ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలంటూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంజేవీఎస్ కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు దుర్గారావు, రోజా, తులసి, కుసుమ, కేవీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆందోళన



అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి ఆందోళన చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 20: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మంగళవారం ఆందోళన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. దీని వల్ల కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఈ కార్యక్రమంలో వైద్యులు ధర్మిరెడ్డి వెంకట్, అడిగర్ల సుధీర్, నాయుడు, సీఐటీయూ నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు, విద్యాసంస్థల ప్రతినిధులు రాజాన అప్పలనాయుడు, ఆడారి సన్యాసిరావు, శివకృష్ణ, బి.శ్రీనివాస రావు తదితరులుప పాల్గొన్నారు.

పూడిమడక హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన



పూడిమడకలో హార్బర్ నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, ఆగస్టు 20 : పూడిమడకలో నిర్మాణంలో ఉన్న హార్బర్ పనులను మత్స్యశాఖ, ఇంజనీరింగ్ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా హార్బర్ మ్యాప్‌ను పరిశీలించారు. హార్బర్ స్థితిగతుల గురించి మత్స్యకార నాయకులను అడిగి అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో హార్బర్ నిర్మాణపు పనులు నత్తనడక నడిచిందని, త్వరిత గతిన పూర్తి చేసి మత్స్యకారులతో పాటు యువకులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని మత్స్యకార నాయకులు కోరారు. సీఐసీఈఎఫ్ డీడీ ఎంబీ బెల్లియప్ప, మత్స్యశాఖ జేడీ వి.వెంకటేశ్వర్లు, మేరిటైమ్ బోర్డ్ సీటీవో శివ శంకర్, డీఎఫ్‌వో పి.ప్రసాద్, ఏడీ షేక్ జాస్మిన్, ఎఫ్‌డీవోలు ప్రసాద్, రవితేజ, మత్స్యకార నాయకులు మేరుగు బాపునాయుడు, మేరుగు ప్రవీణ్ కుమార్, చేపల వేంకటరమణ, వేంకటరావు, అప్పలనాయుడు, దాసరి శ్రీను, మహేష్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల పీహెచ్‌సీలో తనిఖీలు

తుమ్మపాల, ఆగస్టు 20: మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీ, విలేజ్ హెల్త్ సబ్ సెంటర్‌ల్లో మంగళవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం నాయకురాలు డాక్టర్ లూసీకార్డిలియా మాట్లాడుతూ పీహెచ్‌సీ, హెల్త్ సబ్ సెంటర్‌లలో వైద్యసిబ్బంది రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో జగదీశ్, ఎస్‌వో రామచంద్రరావు, సీహెచ్‌ఓ శారదా, సిబ్బంది పాల్గొన్నారు.

24న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

విశాఖపట్నం, ఆగస్టు 20: జడ్పీ సమావేశ మందిరంలో ఈ నెల 24వ తేదీన ఒకటి నుంచి ఏడు వరకు జిల్లాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించనున్నట్టు జడ్పీ డిప్యూటీ సీఈవో సత్యానారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులు హాజరుకావాలని కోరారు.

దువ్వాడ మీదుగా హైదరాబాద్, కటక్ మధ్య ప్రత్యేక రైలు

విశాఖపట్నం, ఆగస్టు 20: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా హైదరాబాద్, కటక్ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె. సందీప్ తెలిపారు. 07165 నంబరు గల రైలు ఈనెల 27 నుంచి వచ్చే నెల 17 వరకు ప్రతి మం గళవారం రాత్రి 8.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 9.07 గంటలకు దువ్వాడ, సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07166 నంబరు గల రైలు ఈనెల 28 నుంచి వచ్చే నెల 18 వరకు ప్రతి బుధవారం రాత్రి 10.30 గంటలకు కటక్‌లో బయలుదేరి మర్నాడు ఉదయం 7.37 గంటలకు దువ్వాడ, రాత్రి 9.00 గంటలకు హైదరాబాద్ చేరుతుంది. ఈ సర్వీసులు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బరంపూర్, కుర్దారోడ్డు, భువనేశ్వర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

మరిడిమాంబ ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ


ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, ఆగస్టు 20 : ఈ నెల 22న అనకాపల్లి గవరపాలెంలో జరగనున్న మరిడిమాంబ ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు బీఎస్ఎంకే జోగినాయుడు తదితరులు స్థానిక రింగురోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కలిసి ఉత్సవానికి ఆహ్వానించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

» ప్రముఖ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ


శ్రీకృష్ణ, సీహెచ్ విజయ్‌ప్రకాష్‌తో విజేతలుగా నిలిచిన విద్యార్థులు


శ్రీకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, ఆగస్టు 20 : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి కృషి చేయాలని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం పాయకరావుపేటలో జరిగిన శ్రీప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవ ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు ఇతర నైపుణ్యాలను నేర్చుకున్నప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 'వేటూరి సుందరరామమూర్తి, సంగీత దర్శకులు ఆర్‌డీ బర్మన్ పాటలను ఎంపిక చేసుకోవడం బాగుందన్నారు. ఈ పోటీలో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారని, నిత్యసాధన చేస్తే మరింత రాణిస్తారన్నారు. అనంతరం శ్రీకృష్ణ తన పాటల ద్వారా ఉర్రూతలూగించారు. విశిష్ట అతిథి, ప్రముఖ కీ బోర్డు ప్లేయర్ రవిశేఖర్ కీ బోర్డుపై పలు పాటలు వినిపించి అలరించారు. అనంతరం అతిథులు శ్రీకృష్ణ, రవిశేఖర్‌లకు విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ ఘనంగా సత్కరించారు. జూనియర్, సీనియర్ విభాగంలో నిర్వహించిన 'గాతా రహే మేరా దిల్' ఫైనల్స్ పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రసంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సీహెచ్ రామతులసి, ఏపీపీఎస్‌పీ సభ్యుడు సోనీవుడ్ తదితరులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

పాయకరావుపేట : విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా సేవా దృక్పథం కలిగి ముందుకు సాగాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ అన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవం ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితం ఇతరులకు సహాయం చేయడం కోసమేనని, ఇది విద్యార్థులు జీవితాంతం కొనసాగించాలని అన్నారు. తమ విద్యార్థులు 2004 నుంచి ఇప్పటి వరకు 2,200 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి తమ సేవా నిరతి చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యనారాయణ, డి.శివగుప్త తదితరులతో పాటు స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రోటరాక్ట్ యంగ్ లీడర్స్, సబల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఆదుకోవాలి

తహసీల్దార్‌కు పలు పార్టీల నేతలు, రైతు సంఘ ప్రతినిధుల వినతి


తహసీల్దార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నక్కపల్లి, ఆగస్టు 20 : విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం మండలంలోని పలు గ్రామాల పరిధిలో భూములిచ్చిన నిర్వాసిత రైతులకు న్యాయం చేయడంలో తాత్సారం చేయడం తగదని పలు పార్టీల నాయకులు, రైతు సంఘ ప్రతినిధులు ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ అంబేద్కర్‌ను మంగళవారం కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, రైతు సంఘ ప్రతినిధులు గంటా తిరుపతిరావు, తళ్ల భార్గవ్, సూరకాసుల గోవింద్ నేతృత్వంలో నిర్వాసిత రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. భూములిచ్చిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ప్యాకేజీ ఇచ్చాకే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. చందనాడ, తమ్మయ్యపేట, మూలపర్ర, పాటిమీద గ్రామాల్లో భూములు కోల్పోయిన వారికి పూర్తి న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ మండల కన్వీనర్ రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ


అమ్మవారిని దర్శించకున్న టీడీపీ నేత ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, ఆగస్టు 20 : దుప్పితూరు గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తాగునీరు. మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు తీర్చుకున్నారు.

ముద్దగా అన్నం, నీళ్ల సాంబారు

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ఆయనతో ఐసీడీఎస్ సిబ్బంది, వీఆర్‌వోలు ఉన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

మాకవరపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని తహసీల్దార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల మెనూతో పాటు వంట గదిని పరిశీలించారు. పాడైపోయిన అరటి పండ్లు ఆ గదిలో ఉండడంతో ఎందుకు ఇక్కడ ఉంచారని పాఠశాల ప్రత్యేక అధికారి త్రివేణిని ప్రశ్నించారు. ముద్దగా ఉన్న బెల్లాన్ని పరిశీలించి విద్యార్థులకు దీనిని ఎలా పెడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థినులకు సరైన భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌వోలు రమణ, సూరిబాబు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే సుందరపు జన్మదినోత్సవం


ఎమ్మెల్యేకు గజమాలతో సత్కరిస్తున్న కూటమి నేతలు, అభిమానులు


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్


యలమంచిలిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు సతీశ్‌కుమార్

రాంబిల్లి, ఆగస్టు 20 : మండలంలోని హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎలమంచిలి నియోజకవర్గం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ముందుగా ఎమ్మెల్యే విజయకుమార్ తన స్వగ్రామమైన కొత్తూరులో కొలువైయున్న గుమ్మడి అమ్మలు పేరంటాలు తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం హరిపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ లాలం భవానీ, టీడీపీ రాష్ట్ర నాయకులు రాజాన రమేష్‌కుమార్, దూళి రంగనాయకులు, నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన కూటమి నాయకులు, బైలపూడి శ్రీరామదాసు, పప్పల నూకన్నదొర, జనపరెడ్డి శ్రీనివాసరావు, వి.దినబాబు, కశిరెడ్డి ప్రసాద్ అధిక సంఖ్యలో కూటమి శ్రేణులు, ప్రభుత్వ అధికారులు ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో కార్యాల యం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

మొక్కలు నాటిన నేతలు...

ఎమ్మెల్యే విజయకుమార్ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో కూటమి నేతలు మొక్కలు నాటారు. రాంబిల్లి కేజీబీవీ స్కూల్లో కూటమి నేతలు గిరి, రఘురాజు, రమేష్ తదితరులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మూలజంప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీ అల్లవరపు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ వేగిరాము, టీడీపీ మండల ఉపాధ్యక్షులు అందుకూరి ప్రసాద్ తదితరులు మొక్కలు నాటారు. దిమిలి మండల పరిషత్ పాఠశాల్లో మండల వైస్ ఎంపీపీ కోటాపు లక్ష్మి, మాజీ సర్పంచ్ కోటాపు వడ్డీకాసులు, మాజీ ఉప సర్పంచ్ నగిరెడ్డి వెంకటరమణ, న్యాయవాది కరణం శ్రీహరి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

ఎలమంచిలి : ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ జన్మదిన వేడుకలను మంగళవారం పార్టీ శ్రేణులు ఎంతో అట్టహాసంగా జరుపుకున్నారు.

పట్టణంలోని జనసేన పార్టీ ప్రాంతీయ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం పార్టీ శ్రేణుల సమక్షంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి, ఎమ్మెల్యే సోదరుడు సుందపు సతీష్ కుమార్ కేక్ కట్ చేశారు. జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, టీడీపీ సర్పంచ్ ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, నేతలు గొర్లె నానాజీ, లవుడు లోవరాజు, గెంజి శ్రీను, టీవరాహా రాంబాబు, జనసేన, టీడీపీ, బీజెపి పార్టీలకు చెందిన నేతలందరి సమక్షంలో కేక్ కట్ చేశారు.

ఈ కార్యక్రమంలో నేతలు అన్నం బాబ్జీ, లాలం సోమునాయుడు, కొలగాని బాస్కరావు, పల్లా సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ యల్లపు గోపి, పెద్ద సంఖ్యలో పార్టీల శ్రేణులు, కూటమి నేతలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో విస్తృత తనిఖీలు


నక్కపల్లి : విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

నక్కపల్లి, ఆగస్టు 20 : మండలంలోని ఉపమాక శివారు కొండ వెనుకపాలెంలో ఉన్న లవ్ ఇన్ యాక్షన్ చిల్డ్రన్స్ హోంను మంగళవారం సాయంత్రం మండల స్థాయి అధికారుల బృందం తనిఖీ చేసింది. తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో నరేశ్, ఐసీడీఎస్ పీవో శ్రీవిద్య తదితరులతో కూడిన బృందం ఈ చిల్డ్రన్స్ హోంను సందర్శించింది. పిల్లల నుంచి వివరాలు సేకరించారు. భోజనం బాగుంటుందని పిల్లలు చెప్పారు. వసతి చాలడం లేదని అధికారులు గుర్తించారు. వంటగది పక్కనే టాయ్‌లెట్ ఉన్నట్టు గుర్తించారు. కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని అధికారులు చెప్పారు.

కశింకోట : మండలంలోని బయ్యవరంలో ఉన్న మదరసాను తహశీల్దార్ సత్యనారాయణ తనిఖీ చేశారు. ఇటీవల కోటవురట్ల హాస్టల్‌లో జరిగిన సంఘటన నేపథ్యంలో ఇక్కడి సౌకర్యాలను పరిశీలించారు. మదనీ దారుల్ ఉలూమ్ సాబ్రియా అశ్వియా ప్రిన్సిపాల్ నాసిం అక్తర్ అక్కడి వసతులను వివరించారు. 35 మంది విద్యార్థులకు ఇక్కడ విద్యతో పాటు వసతి సదుపాయం కల్పిస్తున్నట్టు చెప్పారు.నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని తహసీఈల్దార్ స్పష్టం చేశారు. అనంతరం తాగునీటిని, చుట్టుప్రక్కల వాతావరణాన్ని, గదులను, వంటశాలను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్వో పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి : మాజీ ఎమ్మెల్సీ గాదె


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

ఎస్.రాయవరం, ఆగస్టు 20 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, మహిళా ఉద్యోగుల తమ ఉద్యోగ జీవితకాలంలో ఎప్పుడైనా చైల్డ్ కేర్ లీవ్‌ను ఉపయోగించుకునే విధంగా జీవో తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. మండలంలోని ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. త్వరలో ఉపాధ్యాయుల ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు.

దోమల నివారణతో ఆరోగ్యకర జీవనం

» ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ప్రపంచ దోమల నివారణ దినం » అవగాహన ర్యాలీలు


ఎస్.రాయవరంలో ర్యాలీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 : దోమ రహిత సమాజం ఆరోగ్యానికి సోపానమంటూ వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా మలేరియా విభాగం అధికారులు, సిబ్బంది ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. గవరపాలెంలోని నూకాంబిక అమ్మవారి ఆలయం నుంచి శాంతినగర్ సచివాలయం వరకు జిల్లా మలేరియా అధికారి కె.వరహాలదొర ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చాకలిపేటలో మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి పీజేహెచ్‌ఆర్పీ నాయుడు, సూపర్‌వైజర్ శంకరరావు, ఆర్‌వీ నారాయణరావు, హెల్త్ అసిస్టెంట్లు, మలేరియా,ఫైలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : దోమల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు అన్నారు. మంగళవారం ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ చేసి అనంతరం ప్రతిజ్ఞ చేశారు. పీహెచ్ఎన్ సత్యవతి, విజయలలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ శివాజీ, పారా మెడికల్ సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంత కుమార్ ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీత, ఇందిర, గణేష్, ముకేష్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో వైద్యాధికారి ఎన్.వాసంతి ఆధ్వర్యంలో దోమల నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, డాక్టర్ పీఎన్‌వీ ప్రసాద్, జి.కొండబాబు, వై.అనూష, ఎల్.వీణావాహిణి, పి.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పరవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జయశ్రీ కర్నిషా సీహెచ్‌వో ఎంఎస్ఎస్ సాయిరాం, పీహెచ్ఎన్ జానకిరామన్, హెల్త్‌సూపర్‌వైజర్లు సతీష్, పీవీ రత్నం, చైతన్య, వెంకటరావు, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురంలో వైద్య బృందం పర్యటన


మృతుడు నాగేశ్వరరావుకుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అచ్యుతాపురం, ఆగస్టు 20 : భోగాపురంలో పర్యటించి కిడ్నీ వ్యాధిగ్రస్తులను పరిశీలించామని స్థానిక వైద్యాధికారి శ్రావ్య తెలిపారు. 'భోగాపురంలో ఆగని మరణాలు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం వచ్చిన కథనానికి స్పందించిన వైద్య సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావ్య మాట్లాడుతూ మృతుడు కూండ్రపు నాగేశ్వరరావుకు జూలై 27న కిడ్నీ మార్పిడి జరిగిందన్నారు. అయితే నిమోనియా వ్యాధికి గురై ఊపిరితిత్తులు పాడవంతో అతడు మృతి చెందినట్టు చెప్పారు. వీరి కుటుంబానికి రక్త పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. భోగాపురంలో 12 బోర్లు ఉండగా అందులో ధర్మిరెడ్డి వారి కాలనీకి చెందిన బోరులో మాత్రమే ఫ్లోరిన్ అధికంగా ఉన్నందున ఆ బోరును మూసివేయమని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు గతంలో సూచించినట్టు వైద్యాధికారి తెలిపారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ బోరు నీరు తాగటానికి పనికిరావని బోర్డులు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వేణుగోపాల్, ఎల్. అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

కొత్తూరు, ఆగస్టు 20 : జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని ఎన్డీఏ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఏవోబీ డివిజన్ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జనరల్ బాడీ సమావేశం మంగళవారం నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేయసిన నాగరాజు మాట్లాడుతూ ఇది న్యాయమైన డిమాండ్ అన్నారు. అందుకే బీమా పాలసీలపై జీఎస్టీ ఉపసంహరించు కోవాలన్నారు.

నూతన కార్యవర్గం

ఎల్ఐసీ ఏవోబి అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షునిగా పెంటకోట సైదునాయుడు, కార్యదర్శిగా కరణం మాణిక్యంరావు, ట్రెజరర్‌గా రొంగలి అప్పారావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా ఐతా రాము, టి.హరిబాబు,జాయింట్ సెక్రటరీలుగా మజ్జి చినఅప్పారావు, జె.దుర్గారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.ఎల్.ఆర్.కె.నాయుడు, రెసిడెన్సియల్ సెక్రటరీగా ఎస్. అప్పలనాయుడు ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన జిల్లా కార్యవర్గంతో డివిజన్ అధ్యక్షుడు నాగరాజు ప్రమాణస్వీకారం చేయించి సత్కరించారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి


అనకాపల్లి టౌన్ : రాజీవ్‌కు కాంగ్రెస్ నేతల నివాళి


కశింకోటలో రాజీవ్ విగ్రహానికి పూలమాలలు..

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 : స్థానిక నెహ్రూ చౌక్‌లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి నిర్వహించారు. పలువురు కాంగ్రెస్ పార్టీనాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తి యాదవ్, కాళ్ల సత్యనారాయణలు తుట్టా రమణ, సేనాపతి ఈశ్వరరావు, కట్టమూరి నూకఅప్పారావు, సాయి పాల్గొన్నారు.

స్థానిక నాయుళ్లవీధిలో గల కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల కార్యాలయంలో మంగళవారం దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎగ్గాడ భాస్కరరావు, కొల్లి సత్యారావు, గంట్యాడ సత్తిబాబు, అప్పారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశంలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధికి చట్టంతో గ్రామ పంచాయతీలను పరిపుష్టి చేసేందుకు ఆయన చేసిన కృషి చేశారంటూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లపురెడ్డి కోటేశ్వరరావు, కత్తెర శ్రీధర్, తగరంపూడి గణపతి, సూరా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'మీకు...తెలుసా' సదస్సు

అచ్యుతాపురం, ఆగస్టు 20 : చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం, నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కొండకర్ల, ఆవసోమవరం పాఠశాలల్లో లైంగికంగా సంక్రమించే వ్యాధులపై అవగాహన సదస్సు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పడకేసిన పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

గంటలకు వీఎంఆర్‌డీఏలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఏడు గంటలకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ముచ్చటిస్తారు. రాత్రికి ఇక్కడే బస చేసి గురువారం మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో పర్యాటక అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాజమండ్రి బయలుదేరి వెళతారు.

సంక్షిప్తంగా..

ఇచ్ఛా ఫౌండేషన్‌కి రూ. 50 వేలు విరాళం


విరాళం అందజేస్తున్న సతీశ్‌కుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 20 : ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పుట్టిన రోజు సందర్భంగా కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్‌కు రూ. 50 వేలు విరాళాన్ని విజయకుమార్ సోదరుడు సతీష్‌కుమార్ మంగళవారం అందజేశారు. దివ్యాంగుల పిల్లలతో కొండకర్లలో ఇచ్ఛా ఫౌండేషన్ పేరుతో ఆశ్రమ పాఠశాల నడుస్తోంది. కార్యక్రమంలో కూటమి నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

వైద్యురాలి దుర్ఘటనపై సీపీఎం నిరసన


నిరసన తెలియజేస్తున్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఉదంతాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు మంగళవారం పీటీడీ కాంప్లెక్స్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ ఈ కేసులో నిందుతులను కఠినంగా శిక్షించాలన్నారు. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు దోషులను పట్టుకుని శిక్ష పడేలా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గంటా శ్రీరామ్, కాళ్ల తేలయ్యబాబు, డీడీ వరలక్ష్మి, ఎం.రమణ, పి. శ్రీనివాసరావు, నరసింగరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల శిక్షణ తరగతుల పరిశీలన

కశింకోట, ఆగస్టు 20 : స్థానిక డీపీఎన్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్‌పై జరిగిన స్కూలు కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాన్ని యలమంచిలి డిప్యూటీ డీఈవో ఎం.అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారందరికీ సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల విద్యార్థులందరూ ఇంగ్లీషు సబ్జెక్టుల్లో చదవడం, రాయడం, మాట్లాడడం రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఆచంట రవి, డి.ఆర్.పిలు పాల్గొన్నారు.

సంస్కృత పునరుద్ధరణ అవసరం


భరతమాత చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 : సంస్కృత భాష పునరుద్ధరణకు గ్రంథాలయాలు, విద్యాసంస్థలు కృషి చేయాలని సంస్కృత భారతీ సంస్థ రాష్ట్ర సంపర్క్ మహీధర్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి గౌరీ గ్రంథాలయంలో సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ 14 ఏళ్లు నిండిన వారు పత్రాలయం ద్వారా ఇంటి నుంచే సంస్కృత భాషను నేర్చుకోవచ్చునన్నారు. భారతీయులందరికీ సంస్కృతాన్ని వ్యవహారికంగా తీసుకురావడం కోసం స్పష్టమైన దృక్పథంతో సంస్కృత భారతీయ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టిందన్నారు. ఆధునిక, శాస్త్రీయ పరిశోధనలకు అనుగుణంగా సంస్కృత విజ్ఞానాన్ని అందరూ అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, విల్లూరి జైశ్రీమాన్, కొణతాల నాయుడు, ఏ.త్రినాథ్ పాల్గొన్నారు.

నిరసనకారుల అరెస్టు, విడుదల

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 : స్థానిక నెహ్రూ చౌక్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద సమస్యల పరిష్కారానికి ధర్నా చేస్తున్న ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విడుదల చేశారు. మంగళవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ రక్షణ వేదిక ఆధ్వర్యంలో దళితులు పలు సమస్యలపై ధర్నా చేపటారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న బి. దుర్గా, మరో ఏడుగురిని పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని అనంతరం విడిచిపెట్టారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట, ఆగస్టు 20 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కలాశాలలో ఖాళీగా ఉన్న భౌతిక శాస్త్ర అధ్యాపక పోస్టు (గెస్టు అధ్యాపకుడు) నియామకానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవిశంకర్‌నాయక్ తెలిపారు. భౌతిక శాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన అభ్యర్థులు గురువారం ఉదయం 10 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

సస్యరక్షణపై రైతులకు ఉచిత శిక్షణ

రాంబిల్లి, ఆగస్టు 20 : వివిధ రకాల పంటల్లో సమగ్ర సస్యరక్షణపై రైతులకు కల్పించేందుకు ఈ నెల 21 నుంచి 27 వరకు హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రంలో ఉచిత శిక్షణ నిర్వహిస్తున్నట్లు కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆత్మ' సహకారంతో బీసీటీ కేవీకే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న సుమారు 15 మంది రైతులకు ఈ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

80వ వార్డులో కూటమి నేతల పర్యటన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 20 : జీవీఎంసీ 80వ వార్డు శాంతినగర్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం తెలుగుదేశంపార్టీ వార్డు అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు ఆధ్వర్యంలో కూటమి నాయకులు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వైద్య విద్యార్థినిపై హత్యాచారాన్ని నిరసిస్తూ ర్యాలీ


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువత, మహిళలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 20 : కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారాన్ని నిరసిస్తూ సోమవారం రాత్రి 9గంటలకు గొలుగొండ మండలం రామచంద్రపురంలో యువత, మహిళలు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. మహిళలు స్వేచ్ఛగా తిరిగినప్పుడే సమాజంలో స్త్రీకి గౌరవం దక్కుతుందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ లంక సత్యనారాయణ, జనసేన నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి నివాళి


రాజీవ్‌కు నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

నర్సీపట్నం, ఆగస్టు 20 : మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల సుబ్బన్న ఆధ్వర్యంలో అబీద్ సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బన్న మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశ భవిష్యత్తుని ముందుగానే ఊహించి సైన్స్, టెక్నాలజీ రంగాలను అభివృద్ధి చేశారన్నారు. 18 ఏళ్లకే ఓటుహక్కు వంటి దేశ ప్రగతి కారక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నంగిన రమణ సిద్ధ తదితరులు పాల్గొన్నారు.

267 పశువులకు టీకాలు

నర్సీపట్నం, ఆగస్టు 20 : జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా తొలి రోజు 267 పశువులకు కాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్టు పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. వచ్చే నెల 18 వరకు టీకాలు వేయనున్నట్టు చెప్పారు. 13 వేలు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా పశువులకు వేయించాలని రైతులకు సూచించారు. అలాగే పశువులకు బ్రూసెల్లోసిస్ టీకాలు కూడా వేస్తున్నామని తెలిపారు.

శ్మశాన వాటికల్లో వసతుల కల్పనకు చర్యలు

- సీఎస్‌ఆర్ నిధులతో పనులు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, ఆగస్టు 20 : సీఎస్‌ఆర్ నిధులతో మునిసిపాలిటీలోని 12 శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తామని రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం సీఎంఆర్ లైజన్ అధికారి వి.శంకర్‌రావుతో కలిసి బలిఘట్టం ఉత్తర వాహిని రోడ్డులో ఉన్న శ్మశాన వాటికను పరిశీలించారు. శ్మశాన వాటిక ప్రవేశ ద్వారా నుంచి దారి మార్గంలో టైల్స్, నీడనిచ్చే మొక్కలు, జల్లు స్నానాల పైపులు మరమ్మతు, శివుడు విగ్రహం ముందు, పానుపు షెడ్డులో లైట్లు తదితర అభివృద్ధి పనులు చేయాలని సీఎంఆర్ లైజన్ అధికారికి సూచించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ మునిసిపాలిటీలోని 12 శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పన ఏర్పాటు విషయమై 12 మంది పారిశ్రామికవేత్తలతో చర్చించామని, సీఎస్‌ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి ముందుకు వచ్చారని తెలిపారు. అందులో భాగంగా నర్సీపట్నం శ్మశాన వాటికను పార్కు మాదిరిగా అభివృద్ధి చేయడానికి సీఎంఆర్ అధినేత ముందుకు వచ్చారని తెలిపారు.


సీఎంఆర్ ప్రతినిధితో కలిసి శ్మశాన వాటికను పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

పలు అభివృద్ధి పనులకు చర్యలు

ఈ నెల 30న ఏరియా ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. తనతో పాటు జిల్లా కలెక్టర్ కూడా పాల్గొంటారని తెలిపారు. గత ఐదేళ్లలో ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధికి వచ్చిన నిధులు ఏం చేశారనే దానిపై సమీక్షిస్తామని చెప్పారు. రోగులకు పెట్టే భోజనం నాణ్యత ఉండటం లేదన్నారు. ఆస్పత్రికి వచ్చే డెలివరీ కేసులు ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ నిర్వహణ లేక పని చేయడం లేదన్నారు. మునిసిపాలిటీలో రోడ్ల అభివృద్ధి పనులకు రూ.4 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ ప్రత్యేకంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. లంబసింగి గెస్ట్ హౌస్ పనులు మొదలు పెట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూడేళ్ల క్రితం బొర్రాకేవ్స్, లంబసింగి అభివృద్ధికి కేంద్రం రూ.100 కోట్లు విడుదల చేసిందని, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

గబ్బాడ ఇసుక ర్యాంపు వ్యవహారంపై సమగ్ర విచారణ : జనసేన నేతల డిమాండ్


విలేకరులతో మాట్లాడుతున్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, ఆగస్టు 20 : మండలంలోని గబ్బాడలో గల ప్రభుత్వ ఇసుక ర్యాంపులో వైసీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన దోపిడీపై విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలని నర్సీపట్నం జనసేన పార్టీ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. నర్సీపట్నంలో మంగళవారం జనసేన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గబ్బాడ ఇసుక రీచ్‌లో హైదరాబాద్‌కు చెందిన పతిమ కంపెనీ వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్ల రూపాయలు దోచుకున్నదని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ఇప్పటికే స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టి సారించారన్నారు. అయితే ఈ విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, అవినీతిపరులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ టౌన్ అధ్యక్షుడు అద్దేపల్లి గణేష్, నాయకులు గండెం దొరబాబు, వెలగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

- రైతులకు పశువైద్యాధికారి శిరీష సూచన

కృష్ణాదేవిపేట, ఆగస్టు 3 : ప్రభుత్వం జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధులు రాకుండా ఉచితంగా టీకాలను వేస్తున్నామని, దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ శిరీష కోరారు. కృష్ణాదేవిపేట పశువైద్యశాలలో మంగళవారం టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ వచ్చే నెల 18 వరకు పశువైద్యశాలల్లో టీకాలు వేయనున్నట్టు వెల్లడించారు. ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గడాన్ని నివారించడం, దూడల మరణాల నియంత్రణ, ఆరోగ్యంగా ఎదగడానికి ఈ టీకాలు దోహదపడతాయని పశువైద్యాధికారి తెలిపారు.

22న మరిడి మహలక్ష్మీ జాతర



నాతవరం, ఆగస్టు 20 : ఈ నెల 22న నాతవరంలో మరిడిమహలక్ష్మీ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ ఉంటుందన్నారు. సాయంకాలం అమ్మవారి జాతర నాతవరం గ్రామ చివరి నుంచి మరిడి అమ్మవారి ఆలయం వరకు డప్పులు, కోలాటం, మందుగుండు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఊరేగింపుగా బయలు దేరుతుందన్నారు. జాతర అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్న తర్వాత రాత్రి 9 గంటలకు గుంటూరు బృందంతో డాన్స్ బేబీ డాన్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

ఏఎల్ పురంలో పారిశుధ్య నిర్వహణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కృష్ణాదేవిపేట, ఆగస్టు 20 : గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో నెలలు తరబడి పేరుకుపోయిన చెత్త కుప్పల తొలగింపునకు ఎట్టకేలకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఏఎల్‌పురంలో క్షీణించిన పారిశుధ్యం' శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు గ్రామంలో బీసీ కాలనీ, గొల్లవీధి, ఎస్టీ కాలనీ తదితర వీధుల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు. కాలువల్లో పూడిక తొలగించారు. మురుగునీరు సక్రమంగా పారేలా పైపులైన్లు ఏర్పాటు చేశారు.


కాలువల్లో పూడికలు తీస్తున్న సిబ్బంది

మెడికోపై అత్యాచారం, హత్య ఉదంతంపై నిరసన

నర్సీపట్నం, ఆగస్టు 20 : కోల్‌కతాలోని మెడికల్ కళాశాలలో మెడికోపై సామూహిక అత్యాచారం, హత్యకు నిరసనగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీఆర్ మిని సేడియంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. పని చేసే ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని, వైద్య వృత్తిని గౌరవించాలని, మెడికో విద్యార్థినిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, సంయుక్త కార్యదర్శి పిట్ల శ్రీనివాసరావు, అడిగర్ల వరహాలనాయుడు, ఎంఎస్ ప్రసాద్, ఏవీ ప్రసాద్, విశ్రాంత ఎంఈవో జేఎస్ఎస్ నాగేశ్వరావు, విశ్రాంత ఆర్డీవో కనకరాజు పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాలు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 20 : గొలుగొండ మండలం ఏఎల్‌పురం కనకదుర్గ ఆలయంలో మహిళలు మంగళవారం మంగళ గౌరీ వ్రతాలు చేశారు. శ్రావణ మంగళవారం సందర్భంగా ఏఎల్‌పురం, పాత కృష్ణాదేవిపేట, కొంగసింగి, చోద్యం, నాగాపురం తదితర గ్రామాలకు చెందిన పలువురు ముత్తైయిదువలతో ఆలయ అర్చకుడు కాశీభట్ల దక్షిణామూర్తి శర్మ ఆధ్వర్యంలో మంగళ గౌరీవ్రతాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తు మహిళలు పాల్గొన్నారు.



ముద్దగా అన్నం, నీళ్ల సాంబారు

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. ఆయనతో ఐసీడీఎస్ సిబ్బంది, వీఆర్‌వోలు ఉన్నారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

మాకవరపాలెంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని తహసీల్దార్ మంగళవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. విద్యార్థినుల మెనూతో పాటు వంట గదిని పరిశీలించారు. పాడైపోయిన అరటి పండ్లు ఆ గదిలో ఉండడంతో ఎందుకు ఇక్కడ ఉంచారని పాఠశాల ప్రత్యేక అధికారి త్రివేణిని ప్రశ్నించారు. ముద్దగా ఉన్న బెల్లాన్ని పరిశీలించి విద్యార్థులకు దీనిని ఎలా పెడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థినులకు సరైన భోజనం పెట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ కృష్ణమూర్తి, వీఆర్‌వోలు రమణ, సూరిబాబు ఉన్నారు.

పడకేసిన పర్యాటకం

... 5వ పేజీ తరువాయి

గంటలకు వీఎంఆర్‌డీఏలో సమావేశం నిర్వహిస్తున్నారు. ఏడు గంటలకు ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ముచ్చటిస్తారు. రాత్రికి ఇక్కడే బస చేసి గురువారం మూడు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులతో పర్యాటక అంశాలపై సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి రాజమండ్రి బయలుదేరి వెళతారు.

చోడవరం నియోజకవర్గం

గోవాడలో డిస్టిలరీ ఏర్పాటు చేస్తాం

- డిసెంబరులోనే షుగర్స్ క్రషింగ్: ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, ఆగస్టు 20: గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో డిస్టిలరీ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇథనాల్ కంటే డిస్టిలరీ వల్ల కార్మికులకు ఉపాధి దొరకడంతో పాటు ఈ ప్రాంత రైతులకు మేలు చేకూరుతుందన్నారు. చెరకు పంటతో పాటు మొక్కజొన్న కూడా సాగు చేస్తే డిస్టిలరీ నడపడం సాధ్యమేనన్నారు. అలాగే నూకలు కూడా మొలాసిస్ తయారీకి ఉపయోగపడతాయన్నారు. డిస్టిలరీ ఏర్పాటుపై అధ్యయనం చేశామని తెలిపారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఈ ఏడాది క్రషింగ్ ఉంటుందని, సెప్టెంబరులో ఓవరాలింగ్ పనులు చేపట్టి డిసెంబరులో క్రషింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. సబ్బవరం నుంచి చోడవరం మీదుగా నర్సీపట్నం వరకూ బీఎన్ రోడ్డును జాతీయ రహదారిగా విస్తరించడం ఖాయమని, ఇది తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కూడా కూటమి ప్రభుత్వ హయాంలో పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన భవనాలతో పాటు జ్యోతిబాపూలే స్కూల్ నిర్మాణాలను కూడా చేపడతామన్నారు. జ్యోతిబాపూలే స్కూల్ కోసం ఎంపిక చేసిన జన్నవరం, పాలిటెక్నిక్ కళాశాలకు ఎంపిక చేసిన వెంకన్నపాలెం స్థలాలు దూరం కావడంతో విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. పట్టణంలోని ఇంటింటికీ కొళాయి నిర్వహణను మరింత మెరుగుపరుస్తామని రాజు వివరించారు.

చెరకు రైతుల బకాయిలు ఇప్పించండి

- చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరమణ

చోడవరం, ఆగస్టు 20: గోవాడ చెరకు రైతులకు వెంటనే బకాయిలు చెల్లించాలని ఏపీ చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బకాయిలు చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించినా, ఇంతవరకూ రైతులకు అందలేదన్నారు. సుమారు రూ.9 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఇప్పటికైనా యాజమాన్యం స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ గడ్డి పెంపకంతో దోమల నియంత్రణ

చోడవరం, ఆగస్టు 20: దోమల నియంత్రణలో నిమ్మగడ్డి ప్రధాన భూమిక పోషిస్తుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్, జంతుశాస్త్ర అధ్యాపకులు రత్నభారతి చెప్పారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం దోమల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల సంతతి వ్యాప్తి, వాటి అనార్థాలను వివరించారు. దీనిపై గ్రామాల్లో విద్యార్థులు విస్తృతంగా ప్రచారం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మంగమ్మ, సూర్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా ఓటర్ల సర్వే ప్రారంభం

రోలుగుంట, ఆగస్టు 20: మండలంలోని ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా 24 పంచాయతీల్లో బీఎల్వోలు ఓటరు జాబితాలో ఉన్న పేర్లు, గ్రామాల్లో ఇళ్లల్లో ఉన్న ఓటర్ల వివరాలను పక్కాగా పరిశీలిస్తున్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారికి నూతన ఓటరుగా చేర్పుతున్నారు. అక్టోబరు 18వ తేదీ వరకు ఈ సర్వే చేపట్టనున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పాడి పశువులకు వ్యాధి నివారణ టీకాలు

రోలుగుంట, ఆగస్టు 20: మండల వ్యాప్తంగా పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని పశు వైద్యాధికారి నూకేశ్వరరావు తెలిపారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు. మండల వ్యాప్తంగా 12 వేల పాడి పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. వచ్చే నెల 8వ తేదీ వరకు ఈ ప్రక్రియ చేపడతామన్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రం రోలుగుంటలో ఏడు బృందాలతో బుధవారం వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

మహిళా సాధికారితే లక్ష్యం: ఎమ్మెల్యే రాజు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 20: మహిళా సాధికారితే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మంగళవారం డ్వాక్రా సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆరోగ్య, సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిని మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి స్వావలంబన, జీవన ప్రమాణాలను పెంచేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ఇందుకోసం మహిళలకు నైపుణ్య శిక్షణను అందించనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వై.బాలరాజు, ఎంఎస్-సీసీలు కె.గణపతి, బి.కొండయ్య, ఏ.రాజు, ఎస్.గణేష్, బి.వెంకటరావు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతో అన్నింటా అభివృద్ధి సాధ్యం

విద్యతో అన్నింటా అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రాజు అన్నారు. మండల పరిషత్ సమావేశం మందిరంలో నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ల సన్మాన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వైసీపీ ప్రభుత్వ సైకో నిర్ణయాలతో పేదలకు ప్రభుత్వ విద్య దూరమైందని విమర్శించారు. గాడి తప్పిన గత ప్రభుత్వ విధానాలను కూటమి ప్రభుత్వం సరిచేస్తున్నదన్నారు. పాఠశాలలకు ప్రణాళికాబద్ధంగా సదుపాయాలు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. విద్యాభివృద్ధే ధ్యేయంగా పాఠశాలల యాజమాన్య కమిటీలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన యాజమాన్య కమిటీల చైర్మన్లను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సువర్ణరాజు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, టీడీపీ నాయకులు గోకివాడ కోటేశ్వరరావు, గేదెల సత్యనారాయణ, ఎంవీవీ.సత్యనారాయణ, దొండా నరేష్, వియ్యపు అప్పారావు, డొంకిన అప్పలనాయుడు, తమరాన దాసు, సుంకర లక్ష్మి, సింగంపల్లి రమేష్ పాల్గొన్నారు.


స్వయం సహాయక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు


కొత్తూరు జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థినులు

వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి వ్యతిరేకంగా విద్యార్థినుల ఆందోళన

చోడవరం, ఆగస్టు 20: కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై దారుణ హత్యాచారాన్ని నిరసిస్తూ సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినులు భారీగా ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రంలోని కొత్తూరు జంక్షన్‌లో మంగళవారం మానవహారం చేపట్టారు. మహిళా డాక్టర్ హంతకులను కఠినంగా శిక్షించడంతో పాటు డాక్టర్లకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులతో పాటు సీఐటీయూ నాయకులు గూనూరు వరలక్ష్మి, వీవీ నాగేశ్వరరావు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘాల నాయకులు దేముడునాయుడు, సత్యనారాయణ, అమ్మాజీ, కాసులమ్మ, సత్యవతి, దేముడమ్మ గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో...


రావికమతంలో విద్యార్థినుల మానవహారం

రావికమతం: వైద్య విద్యార్థిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ రావికమతంలో మంగళవారం సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శంకరరావు మాట్లాడుతూ హత్యాచారానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ లేకపోతున్నదని వాపోయారు. అనంతరం రావికమతం మెయిన్ రోడ్డు కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు


అమ్మవారిని దర్శించుకుంటున్న బండారు

మాడుగుల, ఆగస్టు 20: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వేకువజాము నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆలయం వెనుక భాగంలో వంటవార్పు చేసుకున్నారు. బండారు వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పశు వైద్యుల సేవలు వినియోగించుకోండి


సదస్సులో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

చీడికాడ, ఆగస్టు 20: పశు వైద్యుల సేవలను రైతులు వినియోగించుకోవాలని పశు గణాభివృద్ధి సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.రామ్మోహన్‌రావు కోరారు. మండలంలోని తురువోలు గ్రామంలో మంగళవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం జరిగింది. ఈ కేంద్రాన్ని సర్పంచ్ మట్టా అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు బీళ్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ పిటి.బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూడపెయ్యల్లో మరణాల నివారణ, రూ.500కే లింగ నిర్ధారిత వీర్యం, సంచార పశుఆరోగ్య సేవల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 31 పశువులకు గర్భకోశ వ్యాధులను, 23 ఎదకురాని పశువులకు, 16 పశువులకు చూడిపరీక్షలు, 17 పెయ్యిలకు నట్టల నివారణ మందులు, 98 పశువులకు గాలికుంటువ్యాధి టీకాలు, 40 పశువులకు సాధారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో ఏడీ వి.చిట్టినాయుడు, పశు వైద్యులు కేవీఎస్.రాఘవమ్మ, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సన్యాసమ్మకు కంఠాభరణం వితరణ

దేవరాపల్లి, ఆగస్టు 20: మండల కేంద్రంలోని సన్యాసమ్మ అమ్మవారికి అల్లుపురానికి చెందిన గొర్లె కురుమునాయుడు, దేముడమ్మ కుమారుడు కాశీతార ప్రియ కిలో వెండి కంఠా భరణాన్ని మంగళవారం అందజేశారు. ఆలయ ధర్మకర్త లలితానాయుడు, ఆధ్వర్యంలో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు దాతలను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సింహాచలంనాయుడు, కె.వీరమణ, వి.రమేష్, విశ్వేశ్వరరావు, వెంకటపతి, శ్రీను పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గం

గాలికుంటు వ్యాధితో పశువులకు ప్రమాదం

- పశు సంవర్ధక శాఖ ఏడీ దినేశ్‌కుమార్


వ్యాధి నిరోధక టీకా వేస్తున్న ఏడీ దినేశ్‌కుమార్

కె.కోటపాడు/దేవరాపల్లి, ఆగస్టు 20: గాలికుంటు వ్యాధితో పశువులకు చాలా ప్రమాదమని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు (ఏడీ) దినేశ్‌కుమార్ తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నుంచి పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందని చెప్పారు. పాలు తాగే దూడలలో మరణాలు సంభవిస్తాయని, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు కూడా మృత్యువాత పడతాయని ఆయన హెచ్చరించారు. బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకితే జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయవేయకపోవడం, చూడి నిలబడకపోవడం, మగ పశువులలో వృషణాల వ్యాపు, కీళ్ల వ్యాపు, వంధత్వం తదితర వ్యాధి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అలాగే ఈ లక్షణాలు ఇతర జంతువులకు కూడా వ్యాపిస్తాయని స్పష్టం చేశారు. నాలుగు నుంచి ఎనిమిది నెలల వయసు గల ఆడ పెయ్యిలకు తప్పనిసరిగా టీకాను వేయించాలని సూచించారు. గ్రామ రైతు సేవా కేంద్రాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచామని, ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దేవరాపల్లి పశు వైద్యాధికారి మంజుషారాణి పాల్గొన్నారు

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

కె.కోటపాడు, ఆగస్టు 20: ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. మండలంలోని ఆర్‌ఖై అగ్రహారంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లైన్ సోయింగ్ పద్ధతిలో వరి నాట్లు వేయాలన్నారు. దీనివల్ల అధిక పురుగు మందులు వాడనవసరం లేదని స్పష్టం చేశారు. మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తే రైతుకు మంచి ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈవో లైలాదేవి, వ్యవసాయ సహాయకులు కల్యాణి, హరీష్, సర్పంచ్ నాగభూషణం, స్థానిక నాయకులు చిరికి వెంకటరమణ, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జైతవరంలో పశువైద్య శిబిరం

చీడికాడ, ఆగస్టు 20: మండలంలోని జైతవరం గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కోడూరు సత్యవతి, ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు ప్రారంభించారు. శిబిరంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేశారు. వీఆర్‌వో కోడూరు గౌరీశంకర్, గ్రామ పెద్దలు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదుపై రైతులకు అవగాహన

దేవరాపల్లి, ఆగస్టు 20: మండలంలోని ఎ.కొత్తపల్లి, ముషిడిపల్లి గ్రామాల్లో మంగళవారం పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించారు. వీఆర్వో, సర్వేయర్, వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగు చేస్తున్న వారి పేరుపై నమోదు చేయాలని ప్రభుత్వం సూచించినట్టు చెప్పారు.